క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వారాహి పూజలు



ప్రత్యేక అలంకరణలో మహాగౌరీ అమ్మవారు

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం వారాహీ నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, మండపారాధన, శ్రీదేవి ఖడ్గమాల, లలితా సహస్రనామర్చానలు, సామూహిక కుంకుమార్చనలు, ప్రదోష కాల అర్చన పాదుకానుష్టాన అర్చన, వారాహి సహస్ర నామాచర్చనలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

కర్నూలు(సెంట్రల్): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కార్మికులు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో 'ప్రజా సమస్యలు–కార్మిక వర్గం నిర్వహించవలసిన పాత్ర' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పన్నులను పెంచేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా విద్యుత్, నీరు,చెత్త, ఆర్టీసీ చార్జీలను పెంచేందుకు పూనుకుంటాయని,అలాంటి సమయంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ వారి సహకారంతో పోరాటాలకు దిగాల ని పి లుపునిచ్చారు. నాయకులు పీఎస్ రాధాకృష్ణన్, సాయిబాబా,విజయ్, మధు, షాజహాన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పుత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్ సూచించారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయిలో సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు జాతీయ స్థాయి ఆడే అవకాశం ఉంటుందన్నారు. ఆ సంఘం ప్రతినిధులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు తగదు



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): బ్రాహ్మణ మహిళలను వ్యక్తిగతంగా దూషించిన హైదరాబాద్‌కు చెందిన పైలాదాస్‌ను వెంటనే అరెస్టు చేయాలని లలితా పీఠం పీఠాధిపతి గురుమేడా సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. సోమవారం ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి మేలు చేసే బ్రాహ్మణ జాతిపై నోటికి వచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు. వీహెచ్‌పీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ.. అశేష హిందూ సమాజానికి సనాతన ధర్మాన్ని బోధించే బ్రాహ్మణులపై లేనిపోని ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. ఏబీబీఎం రాష్ట్ర కోఆర్డినేటర్, జిల్లా అర్చక పురోహిత కన్వీనర్ దేవళ్ల వసంత సాయినాథ శర్మ, బ్రహ్మణ మిత్ర మండలాధ్యక్షుడు సందేడల్ చంద్రశేఖర్, కర్నూలు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు క్లౌ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి




మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతాశిశు మరణాల శాతం తగ్గించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. ఆయన సోమవారం డీఎంహెచ్‌ఓ ఛాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష, జిల్లా స్థాయి సమగ్ర గర్భస్రావ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. దేవనకొండ, కృష్ణగిరి, కోసిగి పీహెచ్‌సీలు, రోజా–1 యుపీహెచ్‌సీ పరిధిలో మార్చి నుంచి జూన్ మాసాలలో సంభవించిన మాతృమరణాలపై సమీక్ష జరిపారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు గర్భిణులకు సరైన సమయంలో వైద్యసేవలు అందిస్తే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. హైరిస్క్ గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి సురక్షిత ప్రసవం అయ్యేలా చూడాలని ఆదేశించింది. సమావేశంలో ఎస్‌ఎంఓ భవానీ, డీపీఎంవో ఉమ, డాక్టర్లు సావిత్రి, రత్నకుమారి, సుప్రియ, వసంతలక్ష్మి, డీపీహెచ్‌ఎన్‌ఓ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

'భృతి'.. అంతా భ్రాంతియేనా?

- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని టీడీపీ హామీ
- ఉద్యోగం వచ్చేవరకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని భరోసా
- అధికారం చేపట్టి నెల రోజులైనా భృతి ఊసే ఎత్తని ప్రభుత్వం
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు





కర్నూలు సిటీ: 'జాబు రావాలంటే బాబు రావాలి.. తమ్ముళ్లూ మీ కలలను నేను సాకారం చేస్తాను. ఇంటికొక ఉద్యోగం ఇస్తా.. ఉద్యోగం ఇవ్వకపోతే ఉపాధి కల్పిస్తా.. మీరేమీ చదువుకోకపోయినా నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.2 వేలిస్తా'.. ఈ హామీ గుర్తుందా? 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు సంతకంతో కూడిన కరపత్రాలను తెలుగుదేశం పార్టీ ఊరూరా ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో అధికారంలోకి అయితే వచ్చారు. చెప్పినట్లుగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలు చేశారా అంటే అనేకానేక హామీల్లాగే అటకెక్కించిన విషయం విధితమే.

హామీ అమలుకు టోపీ

కర్నూలు అసెంబ్లీ పరిధిలో నగరపాలక సంస్థ గణాంకాల ప్రకారం 1.34 లక్షల కుటుంబాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతం కావడంతో ప్రతి ఇంట్లోను నిరుద్యోగులు ఉంటారు. కనీస విద్యార్హత ఎస్ఎస్‌సీ, ఐటీఐ. డిప్లొమా, గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, ఎం-ఫార్మసీ, మెడిసిన్ తదితర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులు సుమారుగా 2 లక్షలకుపైగా ఉన్నారు. వీరిలో 30 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. అలాగే వివిధ రంగాల్లో చిరుద్యోగులుగా పని చేస్తున్నారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ, భృతి ప్రకటనతో చాలా మంది ఉద్యోగాలను మానేసి గ్రూప్స్, డీఎస్సీ, కానిస్టేబుల్, గ్రూప్–డీ, ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్, బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకుంటున్నారు. వీరంతా టీడీపీ, జనసేన ప్రకటించిన నిరుద్యోగ భృతిపై ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీని మోసం చేసినట్లు ఇప్పుడు కూడా చేస్తారేమోనని, నెల రోజులు దాటినా భృతిపై ఎలాంటి విధి విధానాలు ఖరారు కాకపోవడం, అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేక నిరుద్యోగులు ప్రభుత్వ తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదే మోసం

మొన్నటి ఎన్నికల్లోనూ 2014 లాంటి హామీనే.. యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. ఉద్యోగం వచ్చే వరకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ, జనసేన హామీనిచ్చి అధికారంలోకి వచ్చింది. బాధ్యతలు చేపట్టి నెల రోజులు పూర్తయినా నిరుద్యోగ భృతిపై ఎలాంటి విధి విధానాలు ఖరారు కాకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. సీఎంగా భాద్యతలు చేపట్టిన తరువాత నారా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి ఈ ఏడాది డిసెంబరులోపే నియామకాల ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం ప్రకటన చేయడం, ఖర్చులకు నిరుద్యోగ భృతి వస్తుందనే ఆశతో ఎంతోమంది నిరుద్యోగులు బతుకుదెరువు, కుటుంబ పోషణ కోసం చేస్తున్న చిరుద్యోగాలను వదిలేసి వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకుంటున్నారు.ఇలాంటి సమయంలో నిరుద్యోగ భృతిపై ఎలాంటి స్పష్టత లేకపోవడం, మెగా డీఎస్సీ కోసం మరో టెట్ పరీక్షను అక్టోబరు నెలకు వాయిదా వేయడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

కుటుంబసభ్యులపై ఆధారపడ్డాను



నేను 2019లో బీకాం కంప్యూటర్స్ పూర్తి చేశాను. ఉద్యోగ అన్వేషణలో ఉన్నా. ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి పార్టీల నాయకులు హామీ ఇచ్చారు. నిరుద్యోగ భృతి వల్ల మాలాంటి వాళ్లకు కుటుంబ సభ్యులపై ఆధార పడకుండా ఉద్యోగాన్వేషణ, పరీక్షలకు, ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో నిరాశతో ఉన్నాం.

– జె.ఆశాలత, వెంకటరమణ కాలనీ

నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలుపుకోవాలి



నేను బీకాం, బీపీఈడీ పూర్తి చేశాను. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నా. నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు. ఎన్నికల హామీలో భాగంగా టీడీపీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పింది. అయితే ఇప్పటివరకు ఎలాంటి విధి విధానాలు ప్రకటించలేదు. నాకు ఆశలు సన్నగిల్లుతున్నాయి. భృతి ఇస్తే నిరుద్యోగులకు ఎగ్జామ్స్ మెటీరియల్‌కు, కోచింగ్‌కు ఉపయోగపడుతుంది. ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలుపుకోవాలి.

– సతీష్, నిరుద్యోగి

ఉద్యోగం వచ్చేవరకు భృతి ఇవ్వాలి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాలి. ఉద్యోగాలు వచ్చే వరకు భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల కాలేదు. విడుదలైన డీఎస్సీ నోటిఫికేషన్‌ను జనవరి వరకు పొడిగించారు. అప్పటివరకు ఇతర నోటిఫికేషన్లు కూడా వచ్చే అవకాశం లేదు. ఈ క్రమంలో వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– కె.భాస్కర్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి

భృతి ఇస్తే ఆర్థిక భారం తగ్గుతుంది



ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా భృతి ఇస్తే నిరుద్యోగులకు కొంతైనా ఆర్థిక భారం తగ్గుతుంది. నేను గత విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం కర్నూలు నగరంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో గ్రూప్స్ కోచింగ్‌కు వెళుతున్నాను. ఖర్చులు, స్టడీ మెటీరియల్ కోసం తల్లిదండ్రులపై ఆధారపడడం ఇబ్బందిగా ఉంది. భృతితో పాటు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జాప్యం చేయకుండా విడుదల చేయాలి.

– సంధ్యపోగు కళ్యాణ్, నిరుద్యోగి

తక్షణమే ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలను కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆలస్యం చేయకుండా నోటిఫికేషన్లు జారీ చేయాలి. 2014లో నిరుద్యోగ భృతి పేరిట మోసగించినట్లు గాకుండా, ప్రస్తుతం జాప్యం చేయకుండా భృతి మంజూరు చేయాలి. పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో తక్షణమే స్పష్టత ఇవ్వాలి.

– ఎస్.శరత్‌కుమార్, నిరుద్యోగి

అజెండా అంశాలపైనే చర్చ





మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య, సమావేశానికి హాజరైన డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, సభ్యులు

- నగర అభివృద్ధికి కృషి చేద్దామని మేయర్ పిలుపు
- వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలన్న కార్పొరేటర్లు
- 15 తీర్మానాలకు ఆమోదం రూ.9.19 కోట్ల నిధులకు అనుమతి
- ప్రశాంతంగా నగరపాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్): నగరపాలక సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ప్రజా సమస్యలు, అజెండా అంశాలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. సోమవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో 5 నెలల తరువాత నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిదులతో కలిసి సమావేశం నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజతో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. సమావేశాన్ని ప్రారంభించిన మేయర్ మాట్లాడుతూ.. నగరపాలకలో భాగమైన కర్నూలు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేల సహకారంతో నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ.. పాణ్యం అర్బన్ పరిధిలోని కల్లూరు వార్డుల్లో పార్కుల కబ్జాను అడ్డుకోవాలని, మంచినీటి సమస్యను పరిష్కరించాలని, జొహరాపురం ఇండోర్ స్టేడియంలో అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలని, ప్రైవేటు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకోవాలన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ.. తమ పరిధిలోని కాలనీలలో రోడ్లు, మురుగు కాల్వలు, పార్కుల అభివృద్ధి వంటి పనులు చేపట్టాలన్నారు. వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తెచ్చారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై తీవ్రంగా స్పందించారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను, కొమ్మలను నరికి అక్కడే వదిలేస్తున్నారన్నారు. ఇలాగే చేస్తే వాటిని విద్యుత్ కార్యాలయం ముందు వేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుకారెడ్డి, నాయకల్లు అరుణ, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై కార్పొరేటర్ల గళం

- వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నా 50వ వార్డులో కుక్కలకు పిల్లలు పుడుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య పరిష్కరించాలని కార్పొరేటర్ షేక్ మహమ్మద్ కోరారు.
- 46వ వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు విన్నవించారు.
- 41వ వార్డులో ఆక్రమణలు తొలగించాలని కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి లేవనెత్తారు.
- 49వ వార్డులో బండ్ నిర్మాణానికి నిధులు కేటాయించడంపై కార్పొరేటర్ ఎస్.క్రిష్ణకాంత్ కృతజ్ఞతలు తెలిపారు
- అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని 12వ వార్డు కార్పొరేటర్ క్రాంతి కుమార్ సభ దృష్టికి తెచ్చారు.
- పాత కల్లూరుకు వెళ్లే కాజు వే బ్రిడ్జి వద్ద వీధి లైట్లు ఏర్పాటు చేయాలని 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి కోరారు.
- 20వ వార్డుకు జేసీబీ కేటాయించాలని, వీధిలైట్ల సమస్య పరిష్కరించాలని కార్పొరేటర్ నాగలక్ష్మీరెడ్డి విన్నవించారు.
- థీమ్ పార్కు పనులు వేగవంతం చేసి, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని 17వ వార్డు కార్పొరేటర్ కైపా పద్మాలతా రెడ్డి కోరారు.
- చెన్నమ్మ సర్కిల్‌లో ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న ఆవులను గోశాలకు తరలించాలని 32వ వార్డు కార్పొరేటర్ ఎస్.శ్రీనివాసులు విన్నవించారు.
- టెండర్లు వేసినా పనులు ప్రారంభించడం లేదని 39వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు అన్నారు.
- పార్కుల అభివృద్ధితో పాటు టాయిలెట్ల సమస్యను పరిష్కరించాలని 28వ వార్డు కార్పొరేటర్ నారాయణ రెడ్డి కోరారు.

15 తీర్మానాలు – రూ.9.19 కోట్ల నిధులకు గ్రీన్ సిగ్నల్

సమావేశంలో మొత్తం 15 అజెండా అంశాలకు సంబంధించి సభ్యులు తీర్మానం చేశారు. ఇందుకు రూ.9.19 కోట్ల నిధులు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు.

- 15వ ఆర్థిక సంఘంకు సంబంధించి అదనంగా ఖర్చు చేసిన రూ.4.46 కోట్లను సాధారణ నిధుల నుంచి వినియోగం
- పారిశుద్ధ్య, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.1.62 కోట్ల బిల్లు చెల్లింపు
- దిన్నెదేవరపాడులో ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బిల్డింగ్‌కు రూ.20 లక్షలతో పైపులైన్ ఏర్పాటు, నీటి చార్జీల వసూలు
- మునగాలపాడులో 15 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రంలో వాష్, ఆలమ్, క్లోరిన్, ముడినీరు, క్లియర్ వాటర్ పంపింగ్ చేసేందుకు రూ.87.50 లక్షల కేటాయింపు
- 49వ వార్డులో బండ్ రోడ్డు నిర్మించేందుకు రూ.49.90 లక్షలు
- 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో నగరపాలక సంస్థ భవనానికి రూ.49.50 లక్షలు కేటాయింపు
- మారుతి మెగాసిటీ–2 లో రూ.10 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు.

నూతన ప్రజాప్రతినిధులకు సత్కారం

కౌన్సిల్ సమావేశానికి నూతన సభ్యులుగా హాజరైన ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరిలను మేయర్, కమిషనర్, టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు.

అత్యాచారాలపై నోరు మెదపని పవన్‌కల్యాణ్

కర్నూలు (అర్బన్): రాష్ట్రంలో చిన్నారులపై అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదని జిల్లా భగీరథ ఉప్పర సంఘం అధ్యక్షుడు బి.సత్యన్న ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు జరిగిన సంఘటనలపై ఆవేశంగా మాట్లాడిన పవన్ అధికారంలోకి వచ్చాక ఎందుకు మాట్లాడలేకపోతున్నారని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉంటే ఒక రకంగా, అధికార పక్షంలో ఉంటే మరో రకంగా ఆయన వ్యవహార శైలి ఉందని సోమవారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలికపై అఘాయిత్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి 8 రోజులవుతున్నా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోవడం దారుణమని మండిపడ్డారు. ముచ్చుమర్రి ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతున్నా హోంమంత్రి ఇప్పటివరకు బాధితులను పరామర్శించకపోవడం శోచనీయమని, ఘటనపై వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన కోరారు.

ప్రతి అర్జీకీ సత్వర పరిష్కారం



అర్జీలు సమర్పిస్తున్న కాలనీల ప్రజలు

కర్నూలు (టౌన్): నగరంలో వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక మేనేజర్ చిన్నరాముడు స్పష్టం చేశారు. స్థానిక నగరపాలకలోని కౌన్సిల్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడ్కో అధికారి పెంచలయ్య, సూపరింటెండెంట్ స్వర్ణలత, ఆర్ఐ సాధిక్, సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

ప్రజలు సమర్పించిన అర్జీల్లోని సమస్యలు ఇవీ..

- చెక్‌పోస్టు సమీపంలోని తమ కాలనీలో రహదారి నిర్మించాలని ప్రభుత్వ వాహన డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.
- పైపులైన్ ఏర్పాటు చేయాలని భ్రమరాంభ కాలనీ వాసులు కోరారు.
- డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని సరస్వతి నగర్ వాసులు విన్నవించారు.
- టీడ్కో ఇంటి కోసం చెల్లించిన నగదు వెనక్కి ఇవ్వాలని చిట్టి గోవర్ధనమ్మ కోరారు.
- తనకు దివ్యాంగ పెన్షన్ పునరుద్ధరించాలని సలావుద్దీన్ వినతిపత్రం ఇచ్చారు.
- తన స్థలానికి రీసర్వే చేయాలని ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన రోజారాణీ అభ్యర్థించారు.
- తన ఇంటికి ట్యాప్ కనెక్షన్ ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని టెలికాం నగర్‌కు చెందిన సుంకన్న ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి విద్యార్థికి తల్లివందనం కింద ఏడాదికి రూ.15 వేలు మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకంపై కూటమి ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలన్నారు. తల్లికి రూ.15 వేలు ఇస్తామని ఇచ్చిన జీఓ నంబర్ 29ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సి.అశోక్, అనిల్, వర్ధన్, అర్జున్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సర్జరీలో విప్లవాత్మక మార్పులు



వైద్య బృందంతో సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఈ విభాగంలో ఆధునిక పరికరాలతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ సర్జరీ ద్వారా శరీర భాగాలను కావాల్సిన రీతిలో మార్చుకోవచ్చని చెప్పారు. ఆసుపత్రిలో ఈ విభాగానికి కావాల్సిన వసతులు కల్పిస్తామన్నారు. బర్న్స్ విభాగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మంజులబాయి, డాక్టర్లు విజయ్‌చంద్రమౌళి, సుదర్శన్, నిరుపమ, పద్మ విజయశ్రీ, రేణుకాదేవి, హరిచరణ్, సాయి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మినరల్ వాటర్ సౌకర్యం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నాలుగు మినరల్ వాటర్ ప్లాంట్లు అందుబాటులోకి తెచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన సోమవారం సూపర్‌స్పెషాలిటీ బ్లాక్, సర్జికల్ వార్డు, గైనిక్ వార్డు, బాలాజీ క్యాంటీన్ వద్దనున్న టీజీవీ మినరల్ వాటర్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవలే మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చామన్నారు. ఏఆర్‌ఎంఓ వెంకటరమణ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఉన్నారు.

టీడీపీకి ప్రొటోకాల్ పట్టదా?



ప్రొటోకాల్ పాటించకుండా టీడీపీ బూత్ నాయకులచే భూమి పూజ చేయిస్తున్న దృశ్యం

కర్నూలు టౌన్: ఈ ఫొటోలో... నగరపాలక సంస్థ పరిధిలోని 4వ వార్డు కుమ్మరిగేరి వీధిలో టెంకాయ కొట్టి భూమిపూజ చేస్తున్న వారంతా తెలుగుదేశం పార్టీ బూత్ స్థాయి నాయకులు. నగరపాలక అసిస్టెంట్ ఇంజినీర్, ఎమినిటీస్ కార్యదర్శి దగ్గరుండి వీరికి టెంకాయ ఇచ్చి పనులు చేస్తున్నారు. వాస్తవానికి ఆ వార్డు కార్పొరేటర్ వైఎస్సార్‌సీపీకి చెందిన ఆర్షియా ఫర్హీన్. మూడేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. 8 నెలల క్రితం కౌన్సిల్‌లో మురుగు కాల్వ సమస్యను వివరించి పరిష్కారానికి రూ.34 లక్షలు నిధులు మంజూరు చేయించారు. టెండర్ పనులు పూర్తయ్యాయి. ఇంత చేసిన కార్పొరేటర్‌కు కనీసం సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించి స్థానిక టీడీపీ నాయకులతో భూమిపూజ చేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై కార్పొరేటర్ ఆర్షియా మాట్లాడుతూ.. ప్రొటోకాల్ పాటించకుండా తన వార్డులో అభివృద్ధి పనులను టీడీపీ నాయకులతో ప్రారంభించడం తనను అవమానించడమే అన్నారు. ఇదిలాఉండగా సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో స్థానికంగా అభివృద్ధి పనులు ఇతర కార్యక్రమాలు చేపడితే కార్పొరేటర్లకు తెలియజేయాలనే ఆదేశాలు మరోసారి బుట్టదాఖలయ్యాయి.